PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 1 | పేజీలు : 8 | ఆదివారం 1 నవంబర్ 2026 | వెల : 2/-





భారత వ్యతిరేక శక్తుల కుట్ర!

- దేశ విభజనకు ప్రయత్నాలు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సోషల్ మీడియాలో అబద్ధాలు, వదంతులతో అస్థిరత సృష్టించే యత్నం
- భారతీయుల ఐక్యతే దేశానికి రక్షణ కవచం
- సర్దార్ పటేల్ 151వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!

- అనుమతి లేదన్న పోలీసులు.. దేశ రాజధానిలో రాజకీయ వేడి
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి భారీ ర్యాలీ
- మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన
- ట్రాఫిక్ ఆంక్షలు.. భారీ భద్రతా ఏర్పాట్లు

వేలం ద్వారా నిధుల సమీకరణకు

సీఎం యోచన

550 ఎకరాల భూమి.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త దుమారం!

మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు..

- వేల కోట్ల ఆస్తి వినియోగంపై కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం
- ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు
- భూమిని వేలం వేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యంతరం.. భవిష్యత్ తరాల ఆస్తిని అమ్మొద్దని డిమాండ్
- 400 ఎకరాలు ఖాళీ.. 150 ఎకరాల్లో నివాసాలు
- భూముల వినియోగంపై సర్కారు నిర్ణయంపై ఉత్కంఠ



హైదరాబాద్

హైదరాబాద్ శివారు మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన న్యాయపోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడగా.. ఇప్పుడు ఆ భూముల భవిష్యత్తుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని ఎలా వినియోగించాలనే అంశం రాజకీయ వివాదంగా మారింది. మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న సుమారు 550.39 ఎకరాల భూమిపై ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన అప్పీళ్లను అక్టోబర్ 29న సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. ఈ భూమిపై ప్రభుత్వ యాజమాన్య హక్కును ధ్రువీకరించింది. భూమిపై హక్కులు - మిగతా3లో



మోడల్ స్కూళ్లకు పబ్లిక్ స్కూళ్ల హోదా!

- రూ.787.54 కోట్లతో విద్యాశాఖ భారీ ప్రణాళిక
- 194 పాఠశాలల్లో 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య
- 2027-28 విద్యా సంవత్సరం నుంచి అమలుకు ప్రతిపాదనలు
- అదనంగా 58,200 సీట్లు.. ప్రాథమిక విద్యకు పెద్దపీట

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందిస్తున్న 194 మోడల్ స్కూళ్లను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా (టీపీఎస్) మార్చేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రూ.787.54 కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వ ఆమోదం లభిస్తే 2027-28 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. మోడల్ - మిగతా3లో

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్ర ఆరోపణలు

ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్..

2023 నియామకాల చట్టాన్ని రద్దు చేయాలని తీర్మానం

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబాటు

దిల్లీలో మాక్ పార్లమెంట్





పేదరికం తగ్గింపులో భారత్ పురోగతి!

- ప్రపంచ బ్యాంక్ గణాంకాలే నిదర్శనం.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- 57.7 శాతం నుంచి 16.1 శాతానికి పేదరికం తగ్గింపు
- 49.6 కోట్ల మంది పేదరిక రేఖ నుంచి బయటకు
- సంక్షేమ పథకాలతో చివరి లబ్ధిదారుడికి ప్రయోజనాలు
- కాంగ్రెస్ పాలనతో పోల్చిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశంలో పేదరికం తగ్గిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్ గణాంకాలను ఉటంకిస్తూ.. 2011 నుంచి 2023 మధ్య కాలంలో 49.6 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. ఈ కాలంలో పేదరిక రేటు 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గినట్లు పేర్కొన్నారు. రోజుకు మూడు డాలర్ల ఆదాయ పరిమితి ఆధారంగా - మిగతా3లో


అన్నదాతకు నవంబర్ వానలే ఆశ!



- అడుగంటుతున్న జలాశయాలు.. ఎండుతున్న పంటలు..
- ఎండిపోతున్న ప్రాజెక్టులు.. తరుముకొస్తున్న కరువు..
- నవంబర్ అన్నదాతను ఆదుకుంటుందా..?
- ఏపీ, తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు
- ఏపీలో 30.5 శాతం.. తెలంగాణలో 25 శాతం వర్షపాతం లోటు
- వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- రబీ సాగుపై నీటి కొరత ప్రభావం
- చేతికొచ్చిన పంటను కాపాడుకోవడమే సవాల్

అమరావతి / హైదరాబాద్

వానాకాలం ముగింపు దశకు చేరుకుంటున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వ్యవసాయ రంగం ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఖరీఫ్ పంటలు చేతికొచ్చే సమయంలో పొలాల్లో తేమ తగ్గిపోవడం, చెరువులు, జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం రైతులను కలవరపెడుతున్నాయి. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. మరోవైపు రబీ సాగుకు నీటి - మిగతా3లో




బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం

- ఇస్రో శాటిలైట్ కెమెరాకు చిక్కిన దృశ్యాలు
- బంగాళాఖాతంలో ఏర్పడిన కొత్త వాతావరణ వ్యవస్థ
- ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ ద్వారా గుర్తింపు
- ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న అల్పపీడనం
- ఏపీ తీరంలో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులకు అవకాశం

అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!

- జాతి ఉక్కుమనిషి పటేల్‌కు ప్రధాని, రాష్ట్రపతి వందనం
- స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద మోదీ పుష్పాంజలి
- ఆధునిక భారత నిర్మాణంలో పటేల్ పాత్ర చిరస్మరణీయం: ముర్ము
- దేశ ఐక్యతకు ఆయన ఆశయాలే మార్గదర్శకం: అమిత్ షా



ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

జీ20 వేదికగా భారత్ గళం.. జైశంకర్ కీలక వ్యాఖ్యలు

చమురు రవాణా మార్గాలకు ఆటంకాలు సృష్టించొద్దు

సైనిక చర్యలతో సమస్యలు పరిష్కారం కావు.. దౌత్యానికే ప్రాధాన్యం

ఎల్‌పీజీ సరఫరాలో స్థిరత్వం తప్పనిసరి



నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

భారత వ్యతిరేక శక్తుల కుట్ర!

ఏక్తానగర్: దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న భారత వ్యతిరేక శక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలో విభజనను ప్రోత్సహించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలు, వదంతులను వ్యాప్తి చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించి, దేశంలో అస్థిరతకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, జాతీయ సమైక్యతే భారతదేశానికి అతిపెద్ద బలమని స్పష్టం చేశారు.

ఐక్యతే దేశానికి రక్షణ కవచం!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ భారత పౌరులపై వాటి ప్రభావం పడకుండా సమర్థంగా ఎదుర్కొన్నామని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. భారీ జనాభా, పరిమిత స్వదేశీ పెట్రోలియం ఉత్పత్తి ఉన్న భారత్‌లోనూ తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని గతంలో అంచనాలు వెలువడ్డాయని చెప్పారు. అయితే దేశ ప్రజల సహకారం, ప్రభుత్వ సమర్థవంతమైన చర్యలతో సంక్షోభాన్ని ఎదుర్కోగలిగామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న వేళ భారతీయుల ఐక్యతే దేశానికి



అతిపెద్ద రక్షణ కవచమని ఉద్ఘాటించారు.

పేదరికంపై గత పాలకులపై విమర్శలు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో పేదరిక నిర్మూలన గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. పేదరికాన్ని తొలగిస్తామని హామీలిచ్చి గతంలో పలువురు ఎన్నికల్లో ఓట్లు అడిగారని విమర్శించారు. పేదరిక నిర్మూలన నినాదాలు చేసినవారు వ్యక్తిగతంగా మరింత సంపన్నులయ్యారని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తి, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని, ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే దేశ పురోగతికి ప్రధాన బలమని పేర్కొన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు

ఉక్కుమనిషి, భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన భారతదేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాయుధ దళాల పరేడ్

పటేల్‌కు నివాళులర్పించిన అనంతరం ఏక్తానగర్‌లో సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాగిన ఈ కవాతులో సుమారు 10 వేల మంది పోలీసు, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు. వాయుసేన నిర్వహించిన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 4,700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి.

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

దిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ఇండీ కూటమి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆయనకు వ్యతిరేకంగా 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. శనివారం దిల్లీలో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై ప్రతిపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే పనిచేస్తున్నారు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. దీనివల్ల సామాన్యుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని విమర్శించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాజ్యాంగబద్ధ సంస్థ గౌరవాన్ని కాపాడాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. సీఈసీపై వ్యక్తిగత విద్వేషం లేదని, ఆయన పనితీరుపైనే తమ అభ్యంతరాలని పేర్కొన్నారు.

2023 చట్టాన్ని రద్దు చేయాలి

ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఖర్గే డిమాండ్



చేశారు. ఆ చట్టం సీఈసీకి విస్తృతమైన రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని స్థాయి రక్షణను సీఈసీకి కల్పించారని ఆరోపించారు. ఈ చట్టం ఆమోదం పొందిన సమయంలో 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు.

14 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 14 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఖర్గే ఆరోపించారు. అక్రమంగా తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండాలంటే భవిష్యత్తులో అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని ఇండీ కూటమి కోరుతోందని తెలిపారు.

ఓటు హక్కును కాపాడాలి

18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతకు దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కల్పించారని ఖర్గే గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ హక్కును బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తాము చొరబాటుదారుల కోసం ఓటు హక్కును కోరడం లేదని, భారత పౌరులందరి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు.

ఇందిరా గాంధీకి నివాళులు

మాక్ పార్లమెంట్ సమావేశానికి ముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఖర్గే నివాళులర్పించారు. లోక్‌సభను తలపించేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు, ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!

దిల్లీ: దేశ రాజధానిలో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఎన్నికల సంఘం పనితీరు, ఓటు హక్కుల పరిరక్షణ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండీ కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. అయితే మార్చ్‌కు అనుమతి లేదని దిల్లీ పోలీసులు ప్రకటించడంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాటం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పరిణామాలకు నిరసనగా ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తన ఎక్స్ ఖాతా ద్వారా పిలుపునిచ్చారు. నవంబర్ 1న మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్--మింటో రోడ్ జంక్షన్ నుంచి మార్చ్ ప్రారంభమై రామ్‌లీలా మైదానం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మార్చ్‌కు అనుమతి లేదన్న పోలీసులు

రాహుల్ గాంధీ ప్రకటనపై స్పందించిన దిల్లీ పోలీసులు.. కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని స్పష్టం చేశారు. అయితే



ఎంపీలు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత వాహనాల్లో కాన్‌స్టిట్యూషన్ క్లబ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. గతంలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

దిల్లీలో భారీ భద్రత.. ట్రాఫిక్ మళ్లింపులు

ఇండీ కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. సెంట్రల్ దిల్లీ పోలీసు విభాగాలతో పాటు అదనపు పారామిలటరీ బలగాలను మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కీలక మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. నేతాజీ సుభాష్ మార్గ్, రాజ్‌ఘాట్, దిల్లీ గేట్, ఐటీఓ, అజ్మేరీ గేట్, రంజీత్ సింగ్ ఫ్లైఓవర్, ఝండేవలన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. రైలు ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

ఎన్ని అడ్డంకులొచ్చినా ర్యాలీ నిర్వహిస్తాం

ఇండీ కూటమి ర్యాలీకి దేశవ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ర్యాలీ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు దిల్లీకి బయలుదేరారని, ఇప్పటివరకు దిల్లీ చూసిన అతిపెద్ద ర్యాలీల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అభిశంసన నోటీసు తిరస్కరణపై ఆగ్రహం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానానికి సంబంధించిన నోటీసును తిరస్కరించడంపై వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులు సంతకాలు చేసిన నోటీసును కనీసం పరిశీలనకు స్వీకరించాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపైనా స్పందిస్తూ, ప్రతిపక్షాల డిమాండ్లను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. 'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది.



పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది. దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం

బంగాళాఖాతంలో మరో తుపాను రూపుదిద్దుకుంటోంది. అర్నబ్ తుపాను తీరం దాటిన కొద్ది రోజులకే, ఆగ్నేయ బంగాళాఖాతంలో మేఘాలు దట్టంగా ఏర్పడి ఒక వ్యవస్థగా మారుతున్న దృశ్యాలను ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ శనివారం ఉదయం గుర్తించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో అధికారులు దీనిని నిశితంగా గమనిస్తున్నారు. అక్టోబర్ 29న దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మొదలైన ఈ వ్యవస్థ, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం నాటికి ఇది వాయుగుండంగా బలపడింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. తాజా శాటిలైట్ చిత్రాల్లో ఒక సుడి లాగా వాయుగుండం స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లో, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని, ఆ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ప్రస్తుతానికి పోర్టులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు.

అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!

ఏక్తానగర్/దిల్లీ: అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు కూడా పటేల్‌కు నివాళులర్పించారు.

దేశ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారు: మోదీ

సర్దార్ వల్లభాయ్ పటేల్ బలమైన భారతదేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ సేవలో ఆయన చేసిన త్యాగం, చూపిన అంకితభావం ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. అఖండ భారత నిర్మాత, జాతి ఉక్కుమనిషికి హృదయపూర్వక వందనాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక భారత రూపశిల్పి: రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆధునిక భారతదేశ ప్రధాన రూపశిల్పిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేశంలోని సంస్థానాల ఏకీకరణతో పాటు పటిష్టమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పాటులో పటేల్ చారిత్రాత్మక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పటేల్ జీవితం, ఆదర్శాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని ఏకం చేసిన మహానేత: అమిత్ షా

సంస్థానాలుగా విడిపోయిన దేశాన్ని తన దూరదృష్టితో ఏకం చేసి బలమైన భారతదేశానికి పటేల్ పునాది వేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. అఖిల భారత సర్వీసుల ఏర్పాటుతో దేశ పరిపాలనా వ్యవస్థకు పటిష్టమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఖేడా, బర్డోలీ సత్యాగ్రహాల ద్వారా రైతుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రజాసేవకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చిన పటేల్ త్యాగం, దేశభక్తి ప్రతి పౌరుడికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ నిర్మాణంలో ఆయన ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా సందేశమిచ్చారు.

దిల్లీలో ప్రముఖుల పుష్పాంజలి

పటేల్ జయంతి సందర్భంగా దిల్లీలోని సర్దార్ పటేల్ చౌక్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం పటేల్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తూ దేశ ప్రజల్లో సమైక్యతా భావాన్ని చాటిచెబుతున్నారు.

ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

అట్లాంటా: ప్రపంచ ఇంధన సరఫరాలో ఆంక్షలు, రవాణా మార్గాల్లో అడ్డంకులు సృష్టించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చమురు, సహజ వాయువు సరఫరాలో అంతరాయాలు కలిగించడం, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరత పెరుగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన వాణిజ్యాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొన్ని దేశాలు వ్యూహాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. అమెరికాలోని అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సరఫరాలో అనిశ్చితి.. ధరల్లో అస్థిరత

ప్రపంచం ప్రస్తుతం ఇంధన ఉత్పత్తి కొరత కంటే సరఫరాలో అనిశ్చితి, అంతరాయాలు, ధరల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటోందని జైశంకర్ పేర్కొన్నారు. ఆంక్షలు, కీలక రవాణా మార్గాల్లో అడ్డంకుల కారణంగా ఇంధన మార్కెట్లలో తరచూ ఒడిదుడుకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వీటి ప్రభావం ముఖ్యంగా తక్కువ ఆదాయ దేశాలపై అధికంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన మార్కెట్లు అందరికీ అందుబాటులో ఉండేలా, సరఫరాలో స్థిరత్వం ఉండేలా జీ20 దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ఎల్‌పీజీ సరఫరా అత్యంత కీలకం

భారత్‌కు వంట ఇంధనంగా ఉపయోగించే ఎల్‌పీజీ నిరంతరాయంగా, నమ్మకంగా అందుబాటులో ఉండటం అత్యవసరమని జైశంకర్ స్పష్టం చేశారు. కొన్ని దేశాలు చమురు, సహజ వాయువు సరఫరాకు సంబంధించి తమకు అనుకూలంగా మినహాయింపులు ప్రకటించడం అంతర్జాతీయంగా ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక దేశం తీసుకునే నిర్ణయాలు ఇతర దేశాలపై చూపే ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయరాదని సూచించారు.

సైనిక పరిష్కారాలు పనిచేయవు

అంతర్జాతీయ సమస్యలకు సైనిక చర్యలు శాశ్వత పరిష్కారం చూపలేవని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. సముద్రయాన సిబ్బందిపై దాడులను తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాలని, నౌకలు, నావికులపై దాడులను నిలిపివేయాలని కోరారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువుల సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు ఈ పరిణామాల భారాన్ని అధికంగా మోస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలు అవసరం

మార్కెట్లలోకి ఉత్పత్తులను అధికంగా మళ్లించడం, సరఫరా గొలుసులను ఆయుధాలుగా ఉపయోగించడం, ఇతర దేశాలకు మార్కెట్ ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని జైశంకర్ విమర్శించారు. ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు, పటిష్టమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణ నుంచి రీసైక్లింగ్ వరకు భారత్ ప్రత్యేక జాతీయ మిషన్‌ను అమలు చేస్తోందని వివరించారు. ఇంధన నిల్వలు, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాల అభివృద్ధికి అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్థిక సహకారం పెరగాలని సూచించారు. ఉగ్రవాద ముప్పును కూడా వ్యూహాత్మక కారణాలతో విస్మరించరాదని హెచ్చరించారు.

పలు దేశాల మంత్రులతో ద్వైపాక్షిక చర్చలు

జీ20 సమావేశం సందర్భంగా జైశంకర్ కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపై చర్చించారు. అర్జెంటీనా విదేశాంగ మంత్రి పాబ్లో క్విర్నోతో వాణిజ్యం, కీలక ఖనిజాలు, రక్షణ, అణు సహకారంపై మాట్లాడారు. మెక్సికో విదేశాంగ మంత్రి రాబర్టో వెలాస్కో అల్వారెజ్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వియెరా, జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెపుల్‌తోనూ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చలు జరిపారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

హోటళ్లలో అపరిశుభ్రత బట్టబయలు!

కిచెన్లలో బొద్దింకలు, ఎలుకల వ్యర్థాలు..

14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్

22 ఆహార సంస్థల్లో తనిఖీలు

544 కిలోల కలుషిత ఆహారం ధ్వంసం

21 ఆహార నమూనాల సేకరణ

మరో 13 కిలోల వాడిన నూనె పారబోత



హైదరాబాద్: నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో అక్టోబర్ 31న ఎ+ ఖాళీజు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి చెందిన 22 ప్రత్యేక బృందాలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసుల సహకారంతో మొత్తం 22 ఆహార సంస్థలను తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా పలు హోటళ్ల వంటగదుల్లో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులను గుర్తించారు.

కిచెన్లలో పురుగులు.. కుళ్లిన ఆహారం

తనిఖీల్లో కొన్ని హోటళ్ల వంటగదుల్లో బొద్దింకలు, ఈగలు సంచరిస్తుండగా, మరికొన్ని చోట్ల ఎలుకల వ్యర్థాలు కనిపించాయి. కుళ్లిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువులను అధికారులు గుర్తించారు. వెజ్, నాన్‌వెజ్ పదార్థాలను ఒకే ఫ్రిజ్‌లో నిల్వ చేయడం, వండిన ఆహారాన్ని సరైన లేబుల్స్ లేకుండా భద్రపరచడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి.

వంట నూనె పదేపదే వినియోగం

కొన్ని హోటళ్లలో వంట నూనెను పదేపదే ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వంటగదుల్లో మురికినీరు నిల్వ ఉండటం, అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, తుప్పుపట్టిన పాత్రలు, మురికిగా ఉన్న చిమ్నీలు, ఎగ్జాస్ట్‌లు కనిపించాయి. ఆహార తయారీలో పాల్గొనే సిబ్బంది హెయిర్ నెట్స్, గ్లౌజులు, అప్రాన్లు ధరించకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.

544 కిలోల ఆహారం ధ్వంసం

అనుమానాస్పద కల్తీపై అధికారులు 21 ఆహార నమూనాలను సేకరించారు. కుళ్లిన కూరగాయలు, కలుషిత ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వస్తువులు, పురుగులు పట్టిన పదార్థాలు కలిపి మొత్తం 544 కిలోల ఆహారాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. పదేపదే వినియోగిస్తున్నారనే అనుమానంతో మరో 13 కిలోల వాడిన వంట నూనెను పారబోశారు.

ప్రముఖ హోటళ్లకు షోకాజ్ నోటీసులు

తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించిన తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, హోటల్ సబ్జీ, పిస్తా హౌస్, స్వీకార్ హోటల్, మండీ ఏ 36 అరేబియన్ కిచెన్, గోల్కొండ హోటల్ అండ్ రిసార్ట్స్, ఇంపీరియల్ మల్టీకుజిన్ రెస్టారెంట్, తైబా బేకరీలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

14 హోటళ్ల లైసెన్సులు సస్పెండ్

తీవ్ర అపరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో 14 హోటళ్లు, రెస్టారెంట్ల ఖీూూ× లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై జరిమానాలతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వేలం ద్వారా నిధుల సమీకరణకు సీఎం యోచన

-మొదటిపేజీ తరువాయి

కోరినవారు సరైన యాజమాన్య ఆధారాలు చూపలేకపోయా రని ధర్మాసనం పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లోని కొన్ని నమోదులు కూడా చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది.

వేలం ద్వారా నిధుల సమీకరణకు సీఎం యోచన

సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మియాపూర్ భూముల ద్వారా ప్రభుత్వానికి వనరులు సమకూర్చుకునే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. భూములను వేలం వేసి వచ్చే ఆదాయాన్ని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, పేదలు, గిరిజనులు, దళితుల సంక్షేమానికి వినియోగించాలనే ఆలోచనను వెల్లడించారు. దీనిపై క్యాబినెట్ సబ్‌కమిటీ పరిశీలించి, అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇంకా వేలం ప్రక్రియ పూర్తికాలేదు.

రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అభ్యంతరం

మరోవైపు మియాపూర్ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ ఆలోచనను బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఈ భూములను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన వెంటనే వేలం ప్రతిపాదన తీసుకురావడం సరైంది కాదని విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం వల్ల భవిష్యత్ తరాలకు వాటి సామాజిక ప్రయోజనాలు దూరమవుతాయని ఆరోపించారు. భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.



400 ఎకరాలు ఖాళీ.. 150 ఎకరాల్లో నివాసాలు

సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రంగారెడ్డి జిల్లా అధికారులు భూముల పరిస్థితిపై సంయుక్త సర్వే నిర్వహించారు. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 550 ఎకరాల్లో సుమారు 400 ఎకరాలు ఖాళీగా ఉండగా, మరో 150 ఎకరాల్లో కాలనీలు, నివాస నిర్మాణాలు, ఇతర కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. ఖాళీగా ఉన్న భూమిని రక్షించేందుకు రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న నివాస నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోబోమని జిల్లా కలెక్టర్ వెల్లడించినట్లు సమాచారం.

ప్రజా ప్రయోజనాలకా.. ఆదాయ సమీకరణకా?

మియాపూర్ భూముల వ్యవహారంలో ఇప్పుడు ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం వాటి వినియోగమే. వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. మరోవైపు భూములను ప్రభుత్వ అవసరాలకు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు నేరుగా వినియోగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నివాసాలు ఏర్పడిన 150 ఎకరాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కూడా కీలకంగా మారింది. రాజకీయ విమర్శలకు మించి ప్రజలకు ప్రయోజనం దక్కేలా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వేలం ప్రతిపాదనపై క్యాబినెట్ ఏం నిర్ణయిస్తుంది? భూముల వినియోగానికి ఎలాంటి ప్రణాళిక రూపొందిస్తుంది? నివాసాలు ఉన్న ప్రాంతాల సమస్యను ఎలా పరిష్కరిస్తుంది? అన్న ప్రశ్నలకు రానున్న రోజుల్లో సమాధానం లభించనుంది.

పిల్లలు సమస్యలు ఎదుర్కోవడంలో అవగాహన కలిగి ఉండాలి
అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్

కరీంనగర్, అక్టోబర్31,(నవగీతం): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా అదనపు జిల్లా న్యాయమూర్తి (స్పెషల్ ఏసీబీ కోర్టు) ఎన్ సంతోష్ కుమార్ సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కట్టరాంపూర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఫోక్సో చట్టం తో పాటు వివిధ చట్టాలపై, బాల బాలికలకు రాజ్యాంగం రక్షణ కవచం లా కొన్ని చట్టాలను ఏర్పరిచిందని ఆ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఎలాంటి సమస్య వచ్చినా సమస్యను ఎదుర్కోవడంలో బాలబాలికలు ప్రదర్శించాల్సిన విషయాలు గురించి తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో న్యాయమూర్తి గారు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎటువంటి న్యాయ సహాయాని కైనా కూడా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తితో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతిరావు, డిప్యూటీ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్, పోలీస్ కానిస్టేబుల్ స్వప్న (షీ టీం), ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు సీనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కాసమల్ల గారు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కార్ఖానా గడ్డ (గాంధీ రోడ్) ను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యను గుర్తించాలి, వద్దు అని చెప్పగలగాలి, నమ్మకస్తులైన పెద్దవారికి తెలియజేయాలి, ధైర్యంగా పోలీసు వారికి చెప్పాలి అని సూచించారు. ఆత్మ సంరక్షణతో సమస్యను ఎదుర్కొనే ధైర్యం పిల్లల్లో ఉండాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎస్.వి.ఆర్. కృష్ణ, శాంతి కుమార్, అశ్విని మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. సత్యనారాయణ మరియు సిపిఓ త్రివేణి పాల్గొన్నారు.



పేదరికం తగ్గింపులో భారత్ పురోగతి!



-మొదటిపేజీ తరువాయి

లెక్కించిన తీవ్ర పేదరికం సైతం 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయిందని వివరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

పేదరికాన్ని తగ్గించడం అంటే కేవలం నినాదాలు ఇవ్వడం కాదని, ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పులు తీసుకురావడమేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో 99.9 శాతం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, 2019 నాటికే గ్రామీణ పారిశుద్ధ్య కవరేజ్ 100 శాతానికి చేరిందని తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా ఎల్పీజీ కనెక్షన్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నల్లా నీటి సౌకర్యం విస్తరించాయని వివరించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద కోట్లాది మందికి రక్షణ కల్పించడంతో పాటు, సుమారు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి, ఆరోగ్య రంగాల్లో చర్యలు

2017 నుంచి 2023 మధ్య దేశంలో 13.4 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి అవకాశాలు పెరిగాయని, అనేక కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు. కేన్సర్ చికిత్సకు ఉపయోగించే 487 ఔషధ బ్రాండ్ల ధరలను నవంబర్ 9 నుంచి తగ్గించినట్లు వెల్లడించారు. వాటిలో 276 రకాల మందుల ధరలు 50 నుంచి 90 శాతం వరకు తగ్గాయని, తద్వారా బాధితులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల మేర ఆదా అవుతుందని వివరించారు.

దళారుల ప్రమేయం లేకుండా పథకాల అమలు

స్వచ్ఛ భారత్, సౌభాగ్య, ఉజ్వల, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలను లక్ష్యాధారితంగా అమలు చేయడం వల్లే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం, నిధుల లీకేజీలను తగ్గించేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.

గత పాలనతో పోల్చిన కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనతో పోలిస్తే ప్రస్తుతం గ్రామీణ పారిశుద్ధ్యం, గ్యాస్ కనెక్షన్ల విస్తరణలో గణనీయమైన మార్పు వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2014లో గ్రామీణ పారిశుద్ధ్య కవరేజ్ 38.7 శాతం, గ్యాస్ కనెక్షన్ల శాతం 55.9గా మాత్రమే ఉన్నాయని గుర్తుచేశారు. గతంలో 'గరీబీ హఠావో' వంటి నినాదాలకే పరిమితమయ్యారని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.

పేదల కష్టాలు తెలిసిన నాయకత్వం

ప్రధాని మోదీ పేదరికాన్ని స్వయంగా అనుభవించిన నాయకుడని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేద కుటుంబాలు ఎదుర్కొనే వంటగ్యాస్, తాగునీరు, వైద్య ఖర్చుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పేదల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, 140 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతో వికసిత్ భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అన్నదాతకు నవంబర్ వానలే ఆశ!



-మొదటిపేజీ తరువాయి

లభ్యతపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో నవంబర్‌లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

రెండు రాష్ట్రాల్లోనూ వర్షపాతం లోటు

అక్టోబర్ 30 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం తెలంగాణలో జూన్ 1 నుంచి అక్టోబర్ 30 వరకు సాధారణంగా 829.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 623.1 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 206.8 మిల్లీమీటర్ల లోటు నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఇది 25 శాతం తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. సాధారణంగా 743.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 516.7 మిల్లీమీటర్లకే పరిమితమైంది. అంటే 226.5 మిల్లీమీటర్ల లోటు నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 30.5 శాతం తక్కువ వర్షం కురిసింది.

జిల్లాలవారీగా భిన్న పరిస్థితులు

రాష్ట్ర సగటు వర్షపాతం మాత్రమే అన్ని ప్రాంతాల పరిస్థితిని ప్రతిబింబించదు. కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా, మరికొన్ని జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా సాగునీటి వనరులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికే ఏపీలో 388 మండలాలు, తెలంగాణలో 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినట్లు కథనంలో పేర్కొన్నారు.

నవంబర్ వర్షాలపై రైతుల ఆశలు

ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకోవడానికి రైతులకు తక్షణం వర్షాలు అవసరం. నవంబర్‌లో వర్షాలు కురిస్తే పంటలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంటుంది. అయితే వర్షాలు కురుస్తాయనే అంచనాల ఆధారంగా మాత్రమే సాగు నిర్ణయాలు తీసుకోకుండా, స్థానిక వాతావరణ సూచనలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రబీ సాగుపై ముందస్తు ప్రణాళిక అవసరం

జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసుకున్న తర్వాతే రబీ సాగుపై రైతులు నిర్ణయం తీసుకోవాలి. నీటి వినియోగంలో పొదుపు పాటించడం, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం, అందుబాటులో ఉన్న నీటిని కీలక దశల్లో వినియోగించడం వంటి చర్యలు అవసరం. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటలవారీగా సూచనలు అందించాల్సిన అవసరం ఉంది.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

మెట్ పల్లి లో ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

-కార్మిక హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతర పోరాటం

-- జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్



మెట్‌పల్లి,అక్టోబర్31,(నవగీతం) భారతదేశ తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల రోడ్డులో ఏఐటీయూసీ జెండాను జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ మాట్లాడుతూ, భారతదేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఏఐటీయూసీ నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా కార్మికులకు అనేక చట్టాలు, హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను హరించే విధంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.26,000 చెల్లించాలని కోరారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పండుగ సెలవులు, జాతీయ సెలవులు, మెటర్నిటీ సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ తన పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్,మెట్ పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, యు. శ్రీనివాస్, సెంట్రింగ్ వర్కర్ యూనియన్ ప్రెసిడెంట్ గద్దల బాలరాజు, పొట్ట ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాతా వినయ్, ఓడల రాకేష్, చౌదరి శివకుమార్, గోవర్ధన్, మాతంగి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

నల్లగొండ ఆలయ వాహన పార్కింగ్ కై వేలంపాట



కొడిమ్యాల, అక్టోబర్ 31(నవగీతం) : కొడిమ్యాలమండలంలోని నల్లగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వాహన పార్కింగ్ కై నవంబరు 3న సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కిరణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.? పార్కింగ్ కాంట్రాక్ట్ కాలపరిమితి 2027 ఫిబ్రవరి 7 నుండి 2029 ఫిబ్రవరి 6వ వరకు రెండేళ్ల పాటు ఉంటుందని అన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు 2 లక్షల రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్(డిడి)ని ఆలయ ఈవో పేరున ధరావత్తు (డిపాజిట్)గా చేసి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు నవంబరు 2వ తేదీ నుంచి ఆలయ కార్యాలయంలో రూ 200 చెల్లించి టెండర్ ఫారాలను పొందవచ్చని, నింపిన సీల్డ్ టెండర్ ఫారాలను నవంబరు 3 న ఉదయం 10 గంటలలోపు ఆలయంలో ఏర్పాటు చేసిన సీల్డ్ బాక్స్‌లో సమర్పించాలని, ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం పూర్తి చేసిన అనంతరం సీల్డ్ టెండర్ల బాక్సులను తెరుస్తారని, బహిరంగ వేలం సీల్డ్ టెండర్ రెండింటినీ పరిశీలించి రెండింటిలో అత్యధిక పాట పాడిన వారికే ఖరారు చేస్తారని తెలిపారు. వేలంపాట పూర్తయిన వెంటనే సదరు విజేత పాట మొత్తంలో 50 శాతం డబ్బును అక్కడికక్కడే చెల్లించాల్సి ఉంటుందని, వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్ పై న్యాయవాదులకు అవగాహన సదస్సు.

కేసు తీర్పులో ఫోరెన్సిక్స్ ఆధారం కీలకం.



జగిత్యాల,అక్టోబర్31,(నవగీతం): నేర దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాముఖ్యత, అనువర్తనాలపై జగిత్యాల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి గారు సదస్సులో మాట్లాడుతూ నేరస్థల పరిశీలన,భౌతిక సాక్ష్యాల గుర్తింపు మరియు పరిరక్షణ,చేతిరాత, సంతకాల పరిశీలన,సంతకాల ఫోర్జరీ,పత్రాల ప్రామాణికత, వేలి ముద్రలు,డీఎన్ఏ పరీక్షలు, సైబర్ మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.వివిధ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్స్ పరీక్షలు ఎంతో కీలకమని అన్నారు. ఈకార్యక్రమం హైదరాబాద్‌కు చెందిన ప్రోబ్‌ల్యాబ్ ఫోరెన్సిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ మోహన్ ఎర్రగొల్ల ప్రధాన వక్తగా పాల్గొని వివిధ ఫోరెన్సిక్ అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి. నాగేశ్వర్ రావు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి మట్ట సరిత బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర నర్సయ్య ఉపాధ్యక్షులు మర్రిపెల్లి సత్యప్రకాశ్ సీనియర్ న్యాయవాదులు రాచకొండ శ్రీరాములు,బండ భాస్కర్ రెడ్డి,మెట్ట మహేందర్, చెందోలి లక్ష్మణ్, ఎనగంటి రామచంద్రం కరవత్తుల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం





: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జిల్లాలో ఆకస్మికంగా పెట్రోలింగ్ వ్యవస్థను తనిఖీ చేసిన ఎస్పీ

జగిత్యాల, అక్టోబర్31,(నవగీతం) జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ జగిత్యాల, మెట్ పల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు.జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దేశ ఐక్యతకు మార్గదర్శకుడైన వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని స్మరించుకుందాం

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహణ





జగిత్యాల, అక్టోబర్31,(నవగీతం) స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారతరత్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ ని పురస్కరించుకుని ఎస్పీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయటం జరిగింది. ఈ ప్రతిజ్ఞలో భాగంగా మన దేశం యొక్క ఐక్యతను, సమగ్రతను మరియు భద్రత ను కాపాడటానికి నన్ను నేను అంకితం చేస్తున్నానని మరియు నా తోటి ప్రజల్లోకి ఈ సందేశాన్ని పంపియటానికి నా వంతు కృషి చేస్తున్నానని ప్రమాణం చేయటం జరిగింది. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ సేవలను స్మరిస్తూ వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'జాతీయ ఐక్యతా దినోత్సవం' సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు వేణు, సైదులు, శ్రీధర్, ఆర్ ఎస్ ఐ లు,జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానించిన జిల్లా ఎస్పీ



జగిత్యాల,అక్టోబర్31,(నవగీతం) పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మహమ్మద్ అలీముద్దీన్ (ఎస్.ఐ), అహ్మద్ ఖాన్ (ఏర్ఎస్ఐ) లను జిల్లా ఎస్పీ గారు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ..పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు. తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ మరియు రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ వాదులు ఏకం కావాలి.



జగిత్యాల, అక్టోబర్, 31:(నవగీతం): విదేశీ భావజాలంతో మన దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న శక్తులను ఎదుర్కునేందుకు జాతీయ వాదులు ఏకం కావాలని "జాతీయ వాదుల సంగమం" స్టీరింగ్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకులతో హైదరాబాద్ లో నవంబర్ 3న నిర్వహించనున్న జాతీయ వాదుల సంగమం" పోస్టర్ ను శనివారం జగిత్యాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ ఎబివిపి నాయకులు మ్యాన మహేష్,మురళీ,పిల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించి ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా పనిచేసిన కాసం వెంకటేశ్వర్లు ఇటీవల భారతీయ జనతా పార్టీ కర్ణాటక రాష్ట్ర సహ ఇన్చార్జిగా నియామకం అయిన సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాదులో "జాతీయవాదుల సంగమం" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలలో ఏబీవీపీలో పనిచేసిన విద్యార్థి నాయకులతో పాటు వివిధ సంస్థలలో పనిచేస్తున్న జాతీయవాదులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్వ ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఇతర జాతీయ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ప్రస్తుతం దేశంలో జరుగుతున్న వివిధ పరిణామాలపై చర్చించనున్నట్లు తెలిపారు. విద్యార్థి ఉద్యమాల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న శక్తుల పట్ల ప్రజలను జాగృతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు జాతీయవాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పూర్వ ఏబీవీపీ నాయకులు ఏసీఎస్ రాజు, గంద్ర ప్రసాదరావు, సంపూర్ణ చారి, ఓరుగంటి చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి,జున్ను రాజేందర్, చింతల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

హత్యా రాజకీయాల సంస్కృతి ఎవరిదో ప్రజలకు తెలుసు వైరా కాంగ్రెస్ ఫైర్

శాంతి నెలకొల్పిన భట్టి పై బురదజల్లే ప్రయత్నం - కాంగ్రెస్ ఆగ్రహం

వైరా, అక్టోబర్ 31 (నవగీతం): ఖమ్మం జిల్లాలో హత్యా రాజకీయాల సంస్కృతి ఎవరిదో ప్రజలకు క్షుణ్ణంగా తెలుసని, శాంతియుత వాతావరణాన్ని తీసుకువచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కపై సిపిఎం నాయకులు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని వైరా మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.వైరా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బోళ్ల గంగారావు, ఆత్మ కమిటీ అధ్యక్షులు మట్టూరి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు కాపా మురళి మాట్లాడారు.చింతకాని మండలం పాతర్లపాడు సిపిఎం నాయకులు సామినేని రామారావు హత్య కేసులో సిపిఎం నేతలు కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాతర్లపాడు గ్రామాల్లో నాలుగు ఎంపిటిసిలు, సర్పంచ్ తో సహా మొత్తం ప్రజా ప్రతినిధులందరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉన్నారని, అటువంటి పరిస్థితిలో సామినేని రామారావును హత్య చేయించాల్సిన అవసరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు.గతంలో మధిర నియోజక వర్గం హత్యలు, కొట్లాటలతో రక్తం ఏరులై ప్రవహించేదని, భట్టి విక్రమార్క మొదటిసారి శాసనసభ్యుడిగా గెలిచిన తర్వాత



నుంచి నాలుగు పర్యాయాలు నియోజకవర్గంలో పూర్తి శాంతి నెలకొందని గుర్తు చేశారు. అలాంటి నాయకుడిపై హత్యా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని అన్నారు.సామినేని రామారావు హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులకు, ముఖ్యంగా ఖమ్మం నగర రక్షక శాఖ మండలాధికారి సునీల్ దత్ బృందానికి అభినందనలు తెలిపారు. ఆధునిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేయడం అభినందనీయ మన్నారు.నిజనిర్ధారణ పరీక్షలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పోలీసులకు పూర్తిగా సహకరించారని, కానీ సిపిఎం నాయకులు మాత్రం ఇంతవరకు ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. నిజం బయటకు రావాలంటే తమ్మినేని బృందం శాస్త్రీయ పరీక్షలకు సహకరించాలని డిమాండ్ చేశారు.సామినేని రామారావు హత్య వెనుక ఆర్థికపరమైన వ్యవహారాలు, భూ తగాదాలు ఉన్నాయని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారని, అందువల్లే కొంతమందిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపారని తెలిపారు. ఈ దర్యాప్తు ఇంకా కొనసాగుతుందని, అసలైన దోషులు ఎవరైనా వదిలిపెట్టబోమని పోలీసులు చెప్పారని తెలిపారు. రామారావు హంతకులను పట్టుకొని వారికి తగిన శిక్ష పడేందుకు, ఆయన కుటుంబానికి సరైన న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, శ్రమిస్తుందని స్పష్టం చేశారు. సిపిఎం నాయకులు రాజకీయ లబ్ధి కోసం లేనిపోని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మచ్చా వెంకటేశ్వరరావు, వైరా మండల సర్పంచులు నూతి వెంకటేశ్వరరావు, జవాజి అశ్విని, తడికమల్ల నాగార్జున, భూక్యా బాలాజీ, మాజీ పురపాలక ఉపాధ్యక్షులు ముళ్లపాటి సీతారాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి సతీష్, పొదిల హరినాథ్, ఎస్ కె సైదా, నర్వనేని అశోక్, ఉంద్రు శ్యాంబాబు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తేళ్లూరి వీరయ్య, వేల్పుల భరత్, కంభంపాటి సత్యనారాయణ, శీలం శ్రీనివాస్ రెడ్డి, సామాజిక మాధ్యమాల విభాగం ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

దేశం మెచ్చిన ఉక్కు మహిళకు ఘన నివాళి

కొణిజర్ల కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు



కొణిజర్ల, అక్టోబర్ 31 (నవగీతం): భారతదేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఉక్కు మహిళ, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు కొణిజర్లలో ఘనంగా జరిగాయి. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, పూలతో నివాళులర్పించారు. కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమాధికారం కోసం ఆమె జీవితాంతం పోరాడారని కొనియాడారు.1969లో 14 ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా పేద ప్రజలకు బ్యాంకు రుణాలు అందేలా చేశారని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులకు కారణమైందని తెలిపారు. పేదరిక నిర్మూలనకు గరీబీ హఠావో నినాదంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, భూసంస్కరణలు చేపట్టి లక్షలాది మంది పేదలకు భూములు పంచారని గుర్తు చేశారు. గోపవరం సహకార సంఘం మాజీ అధ్యక్షులు నెల్లూరు రమేష్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్, రహదారులు వచ్చాయని అన్నారు. ఉప సర్పంచ్ కొనకంచి గోపయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే ఇందిరమ్మ లక్ష్యమని అన్నారు.ఈ వేడుకల్లో కొణిజర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు, ఖమ్మం జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఉపాధ్యక్షులు కొణతం ఉమా శంకర్ రావు, ఖమ్మం జిల్లా వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు దొండ దుర్గయ్య, యువ నాయకులు గూదే ఉపేందర్, కొణిజర్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డిబోయిన ముత్తరావు, రెడ్డిబోయిన నాగులు, పానుగంటి సీతారాములు, దుగ్యాల భిక్షం, వార్డు సభ్యులు బొడ్డు బజార్ మరియు కొణిజర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైరా 100 పడకల ఆసుపత్రిలో ఘనంగా ఆరోగ్య శిబిరం ప్రారంభం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం పురపాలక అధ్యక్షురాలు కాపా చంద్రకళ

వైరా, అక్టోబర్ 31 (నవగీతం): వైరా పురపాలక సంఘం పరిధిలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య శిబిరం ఘనంగా ప్రారంభమైంది. పురపాలక అధ్యక్షురాలు, ప్రముఖ వైద్యురాలు కాపా చంద్రకళ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పురపాలక అధ్యక్షురాలు కాపా చంద్రకళ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్యానికి పెద్దపీట వేస్తోందని, పేద ప్రజలు ఎవరూ వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.వైరా 100 పడకల ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా



ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ ఆరోగ్య శిబిరంలో వందలాది మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, జ్వరాలు, కంటి పరీక్షలు, సాధారణ వ్యాధులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ శిబిరం ఏర్పాటు చేయడంతో వైరా పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన సింగరాయ పాలెం, గోప్యాతండా, కారెపల్లి, తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సేవలను వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగింది.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బత్తినేని హర్ష, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బొల్లా గంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పొదిల హరినాథ్, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, ఆనందరావు, బీక్యా, ఆసుపత్రి వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసైన్మెంట్ భూముల సర్వే పారదర్శకంగా జరగాలి.

ప్రతి రైతుకు న్యాయం చేయాలి:- రాయల కిరణ్



వైరా, అక్టోబర్ 31 (నవగీతం): రైతుల భూముల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అసైన్మెంట్ భూముల సర్వేలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదని బీఆర్ఎస్ పార్టీ పాలడుగు గ్రామశాఖ అధ్యక్షుడు, మండల సమన్వయ సభ్యుడు రాయల కిరణ్ అధికారులను కోరారు. ఖమ్మం జిల్లా వైరా మండలం పాలడుగు గ్రామ రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న అసైన్మెంట్ భూముల సర్వే రెండో రోజు కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మి, రెబ్బవరం జీపీఓతో కలిసి ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల సర్వే అనేది రైతుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తరతరాలుగా భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు నష్టం కలిగించే విధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని స్పష్టం చేశారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేల్పుల బుచ్చమ్మ కుమారుడు వేల్పుల కృష్ణతో పాటు,కీర్తి ధర్మయ్య, పలువురు పాల్గొన్నారు.

పశువైద్య శాఖ నిర్లక్ష్యం బట్టబయలు!

ఆసుపత్రుల్లో సిబ్బంది జాడేది? సమయపాలన ఏదీ?
వైద్యం కోసం వస్తే వైద్యులే కనిపించరు.. రైతుల గోడు పట్టించుకునేదెవరు?
పశువైద్య కేంద్రాల్లో విధుల పట్ల అలసత్వం.. మూగజీవాలకు అందని వైద్యం!



కల్లూరు, అక్టోబర్ 31 (నవగీతం): పశువులకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లోనే నిర్లక్ష్యం రాజ్యమేలుతోందా? రైతుల జీవనాధారమైన పశుసంపదకు సకాలంలో చికిత్స అందించాల్సిన బాధ్యతను కొందరు సిబ్బంది విస్మరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఆసుపత్రులు ఉన్నా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. విధులకు రావాల్సిన సమయాన్ని పట్టించుకోకపోవడం.. వైద్యం కోసం వచ్చే రైతులను గంటల తరబడి నిరీక్షణకు గురిచేయడం వంటి పరిణామాలు పశువైద్య శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సబ్ కలెక్టర్ పర్యటన సమయంలోనూ ఈ పరిస్థితులు వెలుగులోకి రావడం శాఖలో పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతోంది.

విధుల వేళల్లో సిబ్బంది ఎక్కడ?

కల్లూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఉదయం 10 గంటలు దాటినా వెటర్నరీ అసిస్టెంట్ విధులకు హాజరుకాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే తరహా పరిస్థితి చెన్నూరు పశువైద్య కేంద్రంలోనూ కనిపిస్తోందని, ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని పశుపోషకులు వాపోతున్నారు. విధులకు హాజరుకావాల్సిన సమయానికే సిబ్బంది కనిపించకపోతే పశువులకు వైద్యం అందించేది ఎవరు? రైతుల సమస్యలు వినేది ఎవరు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వైద్యం కోసం వస్తే.. ఎదురుచూపులేనా?

రైతులు అప్పులు చేసి, ఎంతో శ్రమించి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను పెంచుకుంటున్నారు. పశువులకు అనారోగ్యం వస్తే ప్రభుత్వ పశు వైద్య కేంద్రాలనే ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో సకాలంలో చికిత్స అందకపోతే పశువుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులే జీవనాధారంగా ఉన్న రైతులకు ఈ పరిస్థితి ఆర్థికంగా కూడా భారంగా మారుతోంది. ఉన్నతాధికారుల పర్యటన సమయంలోనే పరిస్థితులు ఇలా ఉంటే సాధారణ రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తనిఖీలు నిర్వహించడం వరకే అధికారుల బాధ్యత ముగుస్తుందా? క్షేత్రస్థాయిలో మార్పు తీసుకొచ్చే చర్యలు ఎక్కడ? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి

మూగజీవాలకు వైద్యం అందకపోతే బాధ్యత ఎవరిది?

సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయని కొందరు పశుపోషకులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. పశువైద్య కేంద్రాల్లో హాజరు రిజిస్టర్లు, విధుల సమయాలు, వైద్య సేవల వివరాలను పరిశీలిస్తే నిర్లక్ష్యానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీతాలు ప్రభుత్వానివి.. బాధ్యత ప్రజల పట్ల ఉండాలి!

ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వహణపై జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సిబ్బంది హాజరు తీరును పరిశీలించాలి. ప్రతి కేంద్రంలో నిర్దిష్ట సమయాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి.మూగజీవాలకు మాటలు రావు.. వాటి బాధను చెప్పుకునే అవకాశం లేదు. వాటి ప్రాణాలనే నమ్ముకుని జీవిస్తున్న రైతుల ఆవేదనను మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేయకూడదు! ఆసుపత్రి భవనాలు ఉండటం కాదు.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించడమే ముఖ్యం. కల్లూరు, చెన్నూరు పశువైద్య కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలి. బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు సకాలంలో పశువైద్య సేవలు అందించాలని పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

వైరా 17వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



వైరా, అక్టోబర్ 31 (నవగీతం): వైరా పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డులో నిర్మాణంలో ఉన్న సిమెంట్ కాంక్రీటు రోడ్డు పనులను పురపాలక అధ్యక్షురాలు వైద్యురాలు కాపా చంద్రకళ మురళీకృష్ణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో వాడుతున్న సామాగ్రి నాణ్యతను, వేస్తున్న తీరును ఆమె స్వయంగా పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడవద్దని సహాయ ఇంజనీర్ శ్రీమణ్యకు, కాంట్రాక్టర్ కు సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.వైరా పట్టణ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 17వ వార్డు ప్రజలు చాలా కాలంగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారని, వారి విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైరా పట్టణానికి పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులు వస్తున్నాయని, త్వరలోనే అన్ని వార్డుల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి, మున్సిపల్ ఏఈ శ్రీమణ్య, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఏడుకొండలు, గోరంట్ల పిచ్చారావు, తిరుపతి దాసు తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ వైద్యులతో సమీక్షించిన కలెక్టర్

కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి





జగిత్యాల, అక్టోబర్31,(నవగీతం):మెట్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఇతర ఏర్పాట్లను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య సిబ్బంది హాజరు, మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యం కోసం వచ్చే ప్రజల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, ఆసుపత్రులలో పారిశుద్ధ్యం, రోగులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మెట్పల్లి ఆర్డీఓ నరసింహారావు, కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణ పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలి

:: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్






జగిత్యాల, అక్టోబర్31,(నవగీతం) మెటపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, వివిధ అభివృద్ధి పనులను శనివారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించే లక్ష్యంతో చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదులు, డార్మెటరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం పాఠశాలలోని వంట గదిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగదిలో నిల్వ ఉంచిన వంట నూనె ప్యాకెట్లు, ఇతర వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను పరిశీలించి వాటి నాణ్యత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. వంటగదిలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థినులకు అందించే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించి వారి చదువు, వసతులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థినుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థినులకు అందించే ఆహారంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు విద్యార్థినులకు మెరుగైన విద్యా, వసతి సదుపాయాలు కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, డీఈఓ రాము, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి





-- ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

జగిత్యాల, అక్టోబర్ 31,(నవగీతం): గోదావరి పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ఘాట్ల అభివృద్ధి తదితర పనుల పురోగతిపై ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంట్స్ కమిషనర్ హన్మంతరావు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్సులో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్తో పాటు సంబంధిత శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ

గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఇప్పటికే ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటి ప్రస్తుత పురోగతి, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా గోదావరి నదీ తీర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్చించారు.పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, మరుగుదొడ్లు, పార్కింగ్, వైద్య సదుపాయాలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

జిల్లాలో గోదావరి పుష్కరాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, ప్రతిపాదిత అభివృద్ధి పనులు, వాటి పురోగతి, సంబంధిత శాఖల ద్వారా తీసుకుంటున్న చర్యలను వివరించారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈఈపిఆర్, విద్యుత్ శాఖ అధికారులు, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పర్శ్ విధానంతో కొత్త తిప్పలు

ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ రావు



కొడిమ్యాల, అక్టోబర్ 31(నవగీతం) :ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను సులభతరం చేయాల్సిన స్పర్శ్ విధానం ప్రధానోపాధ్యాయులకు కొత్త తిప్పలు తెచ్చిపెడుతుందని పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ఆనంద్ రావు అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూడూర్ లో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఉమాదేవి (స్కూల్ అసిస్టెంట్)సన్మాన మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉమాదేవిని ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..పాఠశాలలకు కేటాయించే కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ ల వినియోగం నుంచి చిన్నచిన్న మరమ్మతుల బిల్లుల సమర్పణ వరకు అనేక నిబంధనలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పర్శ్ విధానంలో మార్పులు తీసుకురావాలని, లేదంటే పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు నిధులు కేటాయించినప్పటికీ వాటిని అవసరమైన సమయంలో వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. హెచ్ఎంలు, సిబ్బందికి నేరుగా డబ్బులు తీసుకునే అవకాశం లేకపోవడంతో ముందస్తు ఖర్చులు ఎవరు భరించాలనే సమస్య తలెత్తుతోందని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి మంజుల, జిల్లా కార్యదర్శి విజయ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అంజయ్య ప్రభుదాస్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



కొడిమ్యాల, అక్టోబర్ 31(నవగీతం) : మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరుతూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం కొడిమ్యాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో వారి డిమాండ్లైన 317 జీవో అమలు చేయాలని, హెచ్ఓటీల వేతనాన్ని పెంచాలని, పీజీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని, అవసరమైన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, 010 పద్దు ప్రకారం జీతాలు చెల్లించాలని, ఓపీఎస్ అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం --- కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సునీతారాణి సస్పెన్షన్

జగిత్యాల, అక్టోబర్ 31,(నవగీతం): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, పరిపాలనా పర్యవేక్షణలో వైఫల్యం, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కారణాలతో కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. సునీతారాణిని తక్షణమే సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.అక్టోబర్ 31న జిల్లా కలెక్టర్ కోరుట్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా, సూపరింటెండెంట్ సంబంధిత సమర్థ అధికారి నుంచి ముందస్తు అనుమతి పొందకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ఆసుపత్రి పరిపాలన, సిబ్బంది పర్యవేక్షణ, రోగులకు నిరంతర వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత కలిగిన అధికారి స్వయంగా అనుమతి లేకుండా గైర్హాజరు కావడాన్ని ఉత్తర్వుల్లో తీవ్రంగా పరిగణించారు.అంతేకాకుండా, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిలో దాదాపు సగం మందికి ఒకేసారి సెలవులు మంజూరు చేసినట్లు గుర్తించారు. ఆసుపత్రి సేవలు నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడకుండా సెలవులు మంజూరు చేయడం పరిపాలనా నిర్లక్ష్యాన్ని, పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ప్రజలకు అత్యవసరమైన వైద్యసేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గుర్తించిన లోపాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, చేపట్టనున్న క్రమశిక్షణ చర్యల దృష్ట్యా డాక్టర్ వి. సునీతారాణిని సస్పెన్షన్లో ఉంచారు.క్రమశిక్షణ చర్యలు ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో జిల్లా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్,అక్టోబర్31,(నవగీతం) కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట వద్ద ఆర్టీసీ బస్సు, గ్రానైట్ బండరాయిని తీసుకెళ్లేందుకు వెళ్తున్న కంటైనర్ ఢీకొన్న ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్తో పాటు బస్సులో ముందు సీట్లలో కూర్చున్న ఐదుగురు ప్రయాణికులు గాయపడగా, వారిని 108 అంబులెన్స్లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆర్టీసీ డీఎంతో ఫోన్లో మాట్లాడిన కలెక్టర్.. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారుల బృందం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వైద్య సహాయం అందించాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు వైద్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కరీంనగర్ ఆర్డిఓ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారనీ, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నల్గొండ క్రాస్ రోడ్డులో సోహైల్ హోటల్ సీజ్

హైదరాబాద్ హైదరాబాద్లోని నల్గొండ క్రాస్ రోడ్డులో ఉన్న సోహైల్ హోటల్పై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి హోటల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు, ఆహార భద్రత ప్రమాణాల ఉల్లంఘనలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోహైల్ హోటల్ను సీజ్ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు.. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకూడదని హోటల్ యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
అధికారుల చర్యలతో ప్రస్తుతం హోటల్ మూతపడింది..

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026

60 సంవత్సరాల అనంతరం కొండగట్టులో శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవం

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్


నవంబర్ 15 నుంచి 20 వరకు చందనోత్సవ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు

నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు స్వామివారి నిజరూప దర్శనం

కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం







జగిత్యాల,అక్టోబర్31,(నవగీతం)కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహించనున్న శ్రీ హనుమాన్ చందనోత్సవ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఐడీఓసీలో సంబంధిత శాఖల అధికారులతో కొండగట్టు చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, సుమారు 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అపూర్వ, అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం అత్యంత విశిష్టమైనదని తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి 20, 2026 వరకు స్వామివారి చందనోత్సవం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 29న తిరిగి స్వామివారికి మండల పూజ, సింధూర లేపనం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు కార్తీక మాసం సందర్భంగా సాధారణ రోజుల కంటే ఉత్సవాల సమయంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సాధారణ రోజుల్లో సుమారు 10 వేల మంది, మంగళ, శని, ఆదివారాలు, సెలవు దినాల్లో సుమారు 20 వేల మంది, పర్వదినాల్లో 25 వేల నుంచి 30 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు నిర్వహించే నిజరూప దర్శనానికి రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పార్కింగ్ నుంచి దర్శనం, తిరుగు ప్రయాణం వరకు ప్రతి అంశంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, ప్రత్యేక బస్సులు, తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, నిరంతరం తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణకు తగిన సంఖ్యలో సిబ్బందిని నియమించి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య సేవలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదుభక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆలయ పరిసరాల్లో మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఉత్సవాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆలయ ప్రాంగణం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో తగినంత విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.రెవెన్యూ శాఖ అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి పార్కింగ్ తదితర అవసరాలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు.పంచాయతీ రాజ్, పారిశుద్ధ్య శాఖలు ఆలయ పరిసరాలు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతర పరిశుభ్రతను నిర్వహించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు, చెత్త సేకరణ కేంద్రాలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఆర్ అండ్ బి శాఖ ఆలయానికి చేరుకునే ప్రధాన, అనుసంధాన రహదారులపై మరమ్మతులు చేపట్టి గుంతలు లేకుండా చూడాలన్నారు.విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గుట్ట కింద ఇద్దరు, గుట్ట పైన ముగ్గురు లైన్‌మెన్లను నిరంతరం విధుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపడంతో పాటు, వేములవాడ నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సుల్లో ఎనిమిది బస్సులను కొండగట్టు మీదుగా నడిపేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.అగ్నిమాపక శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమైన అగ్నిమాపక వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ చందనోత్సవ మహోత్సవం, నిజరూప దర్శనాల విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఉత్సవాల తేదీలు, దర్శన సమయాలు, రవాణా, పార్కింగ్, భక్తులకు కల్పించనున్న సౌకర్యాల వివరాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మరో విస్తృత స్థాయి సమావేశం ప్రస్తుతం నిర్వహించిన సమావేశం చందనోత్సవ మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి ప్రాథమిక సమావేశం మాత్రమేనని కలెక్టర్ తెలిపారు. వచ్చే వారం ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన అనంతరం, క్షేత్రస్థాయిలో గుర్తించిన అవసరాలు, సమస్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై మరో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 60 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అరుదైన మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డిఓ మధు సుధన్, డి.ఎస్.పి కె పురుషోత్తం రెడ్డి ,కొండగట్టు ఈవో ఎస్ అంజనారెడ్డి ,డిపిఓ మదన్మోహన్, డిఎంహెచ్వో సుజాత, మిషన్ భగీరథ ,ఫైర్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణకు అప్రమత్తత, అవగాహన ఎంతో ముఖ్యం





సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫ్లాష్ వాక్

'ఆగి ఆలోచించి, నిర్ధారించుకోండి' అనే నినాదంతో ప్రజలకు అవగాహన



జగిత్యాల,అక్టోబర్31,(నవగీతం) జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం -- అక్టోబర్ 2026లో భాగంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి, ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేయాలనే లక్ష్యంతో జగిత్యాల జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జగిత్యాల పట్టణంలో సైబర్ ఫ్లాష్ వాక్ నిర్వహించారు. (ఆగండి -- ఆలోచించండి -- ధృవీకరించండి) అనే ప్రధాన నినాదంతో నిర్వహించిన ఈ ఫ్లాష్ వాక్ పాత బస్టాండ్ నుంచి ప్రారంభమై తహసీల్దార్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పాల్గొని సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు, జాబ్ ఫ్రాడ్లు, పెట్టుబడుల పేరుతో ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ
ఆగండి -- ఆలోచించండి -- ధృవీకరించండి
అనే మూడు సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద లింక్, మెసేజ్ లేదా ఫోన్ కాల్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా ముందుగా ఆగాలని, ఆ సమాచారం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ఆలోచించాలని , అనంతరం సంబంధిత వ్యక్తులు, వెబ్‌సైట్లు, సమాచార వాస్తవికతను అధికారిక మార్గాల్లో ధృవీకరించుకోవాలని సూచించారు.సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని (ఆగండి -- ఆలోచించండి -- ధృవీకరించండి)సూత్రాన్ని తమ నిత్య డిజిటల్ కార్యకలాపాల్లో భాగం చేసుకొని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమం లో డిఎస్పి పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, దినేష్, మహేష్, మల్లేష్, సుప్రియా మరియు , సైబర్ క్రైమ్ సిబ్బంది, మ్, మెడికల్ కాలేజీ విద్యార్థులు , యువత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం

మల్లాపూర్,అక్టోబర్31,(నవగీతం) మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన మెరుగు రిషిత్ (బబ్లు) ఇటీవల జరిగిన బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తన కాలును కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముష్కరి రవీందర్ మానవత్వంతో స్పందించారు. బాధితుడి చికిత్స, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని రిషిత్ బబ్లు కుటుంబ సభ్యులకు అందజేసి, వారికి తమ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వాల్గొండలో బీజేపీ ఆధ్వర్యంలో చాయ్ పే చర్చ కార్యక్రమం



మల్లాపూర్,అక్టోబర్31(నవగీతం): మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంలో మల్లాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనురావు, పూదరి అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు, ఇతర శక్తులు కలిసి నిరసన కార్యక్రమాల పేరుతో ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. విదేశీ శక్తుల ప్రోత్సాహంతో దేశంలో అధికార మార్పిడికి కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరిగిందని నాయకులు అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో విజయం సాధించలేక, ఇతర మార్గాల ద్వారా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఇలాంటి రాజకీయ విధానాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, దేశ రాజకీయ పరిణామాలు, ప్రతిపక్షాల వైఖరిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ఈ విషయాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, మల్లాపూర్ మండల ఇన్‌చార్జి నరేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, పందిరి నాగరాజు, శ్రీనివాస్, ఇల్లెందుల కాంతయ్య, చారి, కుర్మ రాజారెడ్డి, గోపినేని రాజేందర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్,అక్టోబర్31,(నవగీతం): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. కరీంనగర్ -1 డిపో కి చెందిన ఏ02 ఖజ 6363 నంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టడంతో జరిగిన ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన, నాణ్యమైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సూచించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

దేశ ఐక్యతకు మార్గదర్శకుడైన వల్లభాయ్ పటేల్ గారి స్ఫూర్తిని స్మరించుకుందాం:

జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహణ



జగిత్యాల,అక్టోబర్31,(నవగీతం): స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారతరత్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ ని పురస్కరించుకుని ఎస్పీ గారి ఆధ్వర్యంలో రాష్ట్రియ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయటం జరిగింది. ఈ ప్రతిజ్ఞలో భాగంగా మన దేశం యొక్క ఐక్యతను, సమగ్రతను మరియు భద్రత ను కాపాడటానికి నన్ను నేను అంకితం చేస్తున్నానని మరియు నా తోటి ప్రజల్లోకి ఈ సందేశాన్ని పంపియటానికి నా వంతు కృషి చేస్తున్నానని ప్రమాణం చేయటం జరిగింది. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ సేవలను స్మరిస్తూ వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'జాతీయ ఐక్యతా దినోత్సవం' సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు వేణు, సైదులు, శ్రీధర్, ఆర్ ఎస్ ఐ లు,జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 1
నవంబర్ 2026



‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్.. వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!

టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘ఈఎన్ఈ రీపీట్’ టాలెంట్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

మ్యూజిక్ డైరెక్టర్‌పై క్లారిటీ.. అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!



నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం చీదీఖ 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. చీదీఖ 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తొలుత తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడి ఎంపికపై వస్తున్న వరుస ప్రచారాలకు చిత్ర బృందం తాజాగా స్పందించింది. అనిరుధ్ రవిచందర్, జీవీ ప్రకాష్ కుమార్‌లలో ఎవరినీ ఇప్పటివరకు అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పలువురు సంగీత దర్శకులతో చర్చలు జరుగుతున్నప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



పా. రంజిత్ ‘వేట్టువం’ రిలీజ్ డేట్ ఫిక్స్.. సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘వేట్టువం’ విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపోకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ ‘మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్’ తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది. ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ప్రారంభోత్సవానికి వేళాయె.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన దర్శకుడి భార్య!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘రంగస్థలం’ వంటి సంచలన విజయం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రేపు ఈ చిత్రం ఘనంగా ప్రారంభం కానుండగా, అంతకంటే ముందే సుకుమార్ భార్య తబితా సుకుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ సినిమా గురించి భావోద్వేగపూరితంగా స్పందించారు. సుకుమార్ భార్యగా ఈ ప్రాజెక్ట్ తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సినిమా రచన కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. ఆయన పెట్టిన కష్టం, అభిరుచి, అంకితభావం ఇప్పుడు తెరపైకి రాబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ ఎంతో సమయం కేటాయించి కథపై పనిచేశారని తబితా తన పోస్ట్‌లో వివరించారు. ఆయన రచనలో చూపించిన శ్రమ, పట్టుదల తనకు తెలుసని చెబుతూ.. ఆ కష్టం ఒక రూపం దాల్చడం చూడటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్న రామ్ చరణ్ -- సుకుమార్ కలయిక రెండోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయని తెలిపారు. తబితా పెట్టిన ఈ పోస్ట్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సుకుమార్ కథ కోసం ఇంతగా కష్టపడ్డారనే విషయం అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉండగా, తాజాగా దర్శకుడి భార్య చేసిన వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సినిమా ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ వేడుకతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సినిమా ఏ తరహా కథతో తెరకెక్కనుంది? ఇందులో రామ్ చరణ్ పాత్ర ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలకు కొంత స్పష్టత రావచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించి సుకుమార్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జతకట్టడంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు రేపటి వేడుకలో వెల్లడయ్యే అవకాశముంది.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.